# మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...








Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 262 | ఆదివారం 24 ఆగస్టు 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-


## గోదావరి కావేరి లింక్ లో
# సగం వాటా ఇవ్వాలి..
### మేం ఎక్కడైనా వాడుకుంటామన్న తెలంగాణ




గోదావరి కావేరి లింక్‌లో భాగంగా తరలించే 148 టీఎంసీల జలాల్లో సగం వాటా (74 టీఎంసీలు) ఇవ్వాలని రాహుల్ బొజ్జా డిమాండ్ చేశారు. జీసీ లింక్‌ను తెలంగాణ భూభాగం నుంచే చేపడుతున్నా.. కేవలం 45 టీఎంసీలే కేటాయించారని అన్నారు. కాబట్టి రాష్ట్రంలోని కరువు ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని సగం వాటా ఇవ్వాలని కోరారు. అయితే, రాష్ట్ర విజ్ఞప్తిని ఎన్‌డబ్ల్యూడీఏ తిరస్కరించింది. సగం వాటా ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. కాగా, ఇచ్చంపల్లి నుంచి జీసీ లింక్‌ను చేపడితే.. పలు షరతులతో చేపట్టాలని రాహుల్ బొజ్జా ఎన్ డబ్ల్యూడీఏ చైర్మన్‌కు సూచించారు. తొలుత తమకు గోదావరిలో కేటాయించిన 968 టీఎంసీల నీటి వినియోగానికి రక్షణ కల్పించాలన్నారు. 148 టీఎంసీల తరలింపునకు ఛత్తీస్‌గఢ్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు.

## క్రికెట్ బ్యాట్ కోసం వెళ్లి
# సహస్రను వెంకట్ హత్య చేశాడు




- ఓటీటీ క్రైమ్ సీన్ల ప్రభావంతో హత్యకు పాల్పడ్డ 14 ఏళ్ల బాలుడు
- నెల రోజుల ప్లాన్‌తో సహస్రను హత్య చేసిన పక్కింటి బాలుడు
- బ్యాట్ దొంగలించేందుకు వెళ్ళినపుడు బాలిక అరవడంతో కత్తితో హత్య
- హత్య తరువాత ఆధారాలు మాయం చేసిన బాలుడు, జువైనల్ హోంకు తరలింపు – సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

## ఎవ్వరు అడ్డొచ్చినా
# 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతాం

- తెలంగాణ నగర ప్రణాళికలు దేశానికి ఆదర్శం
- భవితవ్య తరాల కోసం నీటి వనరుల సంరక్షణే లక్ష్యం
- బయోఫిలిక్ అర్బనిజం కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ కీలక వ్యాఖ్యలు

ఎవ్వరు అడ్డొచ్చినా.. భావి తరాల కోసం 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇవాళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయాత్ హోటల్‌లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.




## హైదరాబాద్‌కు రండి..
### ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కి కేటీఆర్ ఆహ్వానం




ప్రముఖ ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తన మొదటి కార్యాలయాన్ని ఈ ఏడాదిలో ఇండియాలో ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన భారత్‌కి రాబోతున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు.






## యూరియా కొరతపై
# కేటీఆర్ డ్రామాలు

- బీఆర్ఎస్-బీజేపీ కలిసి మాయాజాలం చేస్తున్నారు
- ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును ప్రకటించినందుకు రేవంత్ ధన్యవాదాలు
- బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం: స్థానిక ఎన్నికల కోసం మరో బిల్లు సిద్ధం
- బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి ఆమోదం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న తెలంగాణ ప్రభుత్వం
- యూరియా కోసం నాలుగుసార్లు కేంద్ర మంత్రులతో సమావేశమైనట్లు వెల్లడించిన సీఎం రేవంత్
- స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రుల కమిటీ ఏర్పాటు: నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం

హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో శనివారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ప్రకటించినందుకు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ పరిరక్షణ, పౌర హక్కుల కోసం పనిచేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టామని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గం, అసెంబ్లీలో బిల్ ఆమోదించామని గుర్తు చేసారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం మరో బిల్ తెచ్చామని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన 50% రిజర్వేషన్ పరిమితి చట్టం అడ్డంకిగా మారిందని, దాన్ని సవరించేందుకు ఆర్డినెన్స్ తెచ్చామని, గవర్నర్ దానిని కేంద్రానికి పంపారని వెల్లడించారు. బీసీలకు మేలు జరగాలని, రాహుల్ గాంధీ మాట నిలబడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కేసీఆర్ చట్టం వల్ల బీసీలకు 1% రిజర్వేషన్ కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి 90 రోజుల్లో బిల్లులను ఆమోదించాలన్న అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశం పైన సుప్రీమ్ కోర్టు లో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని, అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందన్నారు.

## ఒక్కసారి ఆ తీర్పు చదివి ఉంటే బాగుండేది
### : అమిత్ షాకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి కౌంటర్




ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి.

## హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు




హైదరాబాద్‌లో వరదలు, మురుగునీటి సమస్యలు, చెరువుల కబ్జాలు, పర్యావరణ సమస్యలు వంటి క్లిష్ట అంశాల పరిష్కారానికి ఒక ప్రత్యేక సంస్థ అవసరమని భావించిన ప్రభుత్వం, గత ఏడాది జూలైలో హైడ్రా అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ సంస్థ పనితీరు, భవిష్యత్ దిశపై కీలక వ్యాఖ్యలు చేశారు.


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి
### : మంత్రి పొన్నం




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## నేటి మాట

సత్య మార్గంలో నడిచేవారికి అబద్ధం చెప్పాల్సిన అవసరం రాదు



- బెంజమిన్ ఫ్రాంక్లిన్

## పేదవాడి ఇల్లు ఐదు లక్షల్లో సాధ్యం కాదు

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై మంత్రి పొంగులేటిని కలిసిన ఎంపీ ఈటల
- రాష్ట్రం మాత్రమే కాదు, కేంద్రం కూడా ఇళ్ల నిర్మాణంలో పాత్ర వహించాలి: ఈటల

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన ఆయన సమస్యలపై వివరణాత్మక చర్చ నిర్వహించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మల్కాజిగిరి ఎంపీ పరిధిలో పేదలకు కేటాయించాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.




## పాస్ బుక్కులు, చెప్పులు
# క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా
### - హరీశ్‌రావు ధ్వజం

- రైతుల కన్నీళ్లకు , ప్రభుత్వ వైఫల్యమే కారణం
- యూరియా అడిగితే లాఠీలు
- ఎరువులపై సమీక్ష లేకుండా మిస్ వరల్డ్‌పై మక్కువ: హరీశ్ ఘాటు వ్యాఖ్యలు




ఒకవైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలం అవుతుంటే అధికార పక్షం దాన్ని ప్రతిపక్షాల దుష్ప్రచారంగా చెప్పడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుందని మండిపడ్డారు. కుండపోత వానలో తడుస్తూ రైతులు గంటల కొద్దీ నిలబడటం అబద్ధమా అని మండిపడ్డారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి: మంత్రి పొన్నం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో 6 వేల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లు గుర్తించారు. అధికార పార్టీకి అవకాశమిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ప్రతి బూత్‌కు ఒకరు ఇన్‌ఛార్జిగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకూడదని సూచించారు. నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇన్‌ఛార్జి ఉపాధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు ప్రభావవంతంగా పని చేయాలని తెలిపారు. డివిజన్లలో కార్యాలయాలు ప్రారంభించుకోవాలని.. బూత్‌వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రభుత్వ పథకాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ పాల్గొన్నారు.

# హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు

మొదటి పేజీ తరువాయి

హైడ్రా ఏర్పాటు తర్వాత ప్రభుత్వమే జిహెచ్‌ఎంసి యాక్ట్‌లో మార్పులు చేసి సంబంధిత అధికారాలు కల్పించిందని కమిషనర్ తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరిస్తున్నారని చెప్పారు.



వరదల్లో మురుగు నీరు సమస్యలను పరిష్కరించడం, అకాల వర్షాల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ, చెరువులు–నాలాలను రక్షించడం హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ చెప్పారు. "నాలాల్లో వేలాది ట్రక్కుల పూడికతీత పనులు చేశాం. సిబ్బంది చేతనే మ్యాన్‌హోల్స్, నాలాలు క్లీన్ చేయించాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో కొన్ని ఫోర్కాస్ట్ ఇబ్బందులు ఉన్నా, ఇప్పుడే చేస్తున్న పనులు వచ్చే 100 ఏళ్లకు ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు. "60–65 శాతం చెరువులు మాయం అయ్యాయి. పొల్యూషన్ వల్ల అనేక సమస్యలు వచ్చాయి. వాటిని అడ్డుకోవాలి. CSR పేరుతో చెరువులు కొట్టేయాలని చూస్తే ఊరుకోం. చెరువుల మాదిరిగా నాలాలను కూడా నోటిఫై చేసి కబ్జాలను నిరోధిస్తాం" అని హెచ్చరించారు.

అలాగే, బతుకమ్మ కుంట, కూకట్పల్లి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత స్థానికులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. హైడ్రా ఏర్పడి సంవత్సరం పూర్తయిందని, ఈ కాలంలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని కమిషనర్ తెలిపారు. "తక్కువ మ్యాన్‌పవర్‌తో ఎక్కువ ప్రొడక్టివిటీ సాధించాం. ఇప్పటి వరకు 500 ఎకరాలను కాపాడగలిగాము" అని గర్వంగా చెప్పారు.

# పేదవాడి ఇల్లు ఐదు లక్షల్లో సాధ్యం కాదు

మొదటి పేజీ తరువాయి

గతంలో తప్పిపోయిన పేదల జాబితాను మంత్రి పొంగులేటికి అందించినప్పటికీ, ఇప్పటివరకు కేటాయింపులు సక్రమంగా జరిగేవి లేవని, అలాట్మెంట్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో భూములు దొంగల పుటకు చేరుతున్నాయని చెప్పారు.

అలాగే, ఐదు లక్షల రూపాయలతో పేదవాడు ఇల్లు కట్టే పరిస్థితి కుదరదని, నిజానికి కనీసం 12 లక్షలుగా ఖర్చు ఉంటుందని ఈటల రాజేందర్ వివరించారు. జవహర్ నగర్‌లో ఉన్న భూములు ప్రభుత్వానికి సంబంధం లేకుండా, మాజీ డిఫెన్స్ అధికారులకు కేటాయించబడినందుకు విమర్శలు వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఉన్న ఇండ్లను కూల్చడం కరెక్ట్ కాదని, 60–80 గజాల భూముల్లో ఇళ్ళు నిర్మించినవారు కటిక పేదలే కాక ధనవంతులైనవారే కాదని అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును కలిసే అవకాశం లేకపోవడంతో డిఆర్సీ సమావేశం ఏర్పాటు చేయలేకపోవడంపై బాధ వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నేరుగా సహకరించకపోవడం, అవసరమైతే కేంద్రంతో చర్చలు చేస్తామనే వైపు ఆయన వెల్లడించారు. కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారాల్లో నియమాలు, బాధ్యతలపై కూడా ఈటల రాజేందర్ స్పష్టత ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గూర్చి, కేంద్రంపై మాత్రమే ఒత్తిడి చూపడం సరైనదా కాదని పేర్కొన్నారు. అంతేకాక, ఈటల రాజేందర్ ఉప రాష్ట్రపతి అభ్యర్థి కోసం పార్టీలు ఓట్ల కోసం అభ్యర్థన చేయాలని సూచించారు. ఈ భేటీ, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించడానికి కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకునే దిశగా ముందడుగు కాగలదనే దృక్పథాన్ని ప్రసారం చేస్తుంది.

# గోదావరి కావేరి లింక్ లో సగం వాటా ఇవ్వాలి..
## మేం ఎక్కడైనా వాడుకుంటామన్న తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

జీసీ లింక్ తో దేవాదుల లిఫ్ట్ లో 38.16 టీఎంసీలు, సమ్మక్కసాగర్ లో 46.96 టీఎంసీలు, సీతమ్మసాగర్– సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టుల్లో 67.05 టీఎంసీలు కలిపి 152.17 టీఎంసీల నీటి వినియోగానికి ఎలాంటి అడ్డంకులు ఉండకుండా చూడాలని, వాటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే సమ్మక్కసాగర్ ప్రాజెక్టుపై ప్రభావం పడకుండా చూడాలని, అందుకు అనుగుణంగా గేట్ ఆపరేషన్ ప్రొటోకాల్ షెడ్యూల్‌పై సిమ్యులేషన్ స్టడీస్ చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రానికి జీసీ లింక్‌లో ఇచ్చే వాటాతో పాటు రాష్ట్రంలోని కరువు ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించేందుకు 200 టీఎంసీలు ఇచ్చంపల్లి నుంచి వాడుకునేలా అనుమతి ఇవ్వాలని కోరారు.




ఎక్కడైనా వాడుకుంటం..

తెలంగాణ కోటా కింద ఇచ్చే నీళ్లను శ్రీరాంసాగర్ లేదా దేవాదుల ఆయకట్టు స్థిరీకరణకు వాడుకోవాలన్న రూల్స్‌ను ఎన్‌డబ్ల్యూడీఏ పెడుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర సర్కారు అందుకు అంగీకరించలేదు. ఆ నీటిని రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునేలా తమకు స్వేచ్ఛనివ్వాలని రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. జీసీ లింక్‌లో భాగంగా కృష్ణా బేసిన్‌లో అవసరమున్న చోట రెండు రిజర్వాయర్లను కట్టివ్వాలని, ఆయా రిజర్వాయర్లకు నీటి తరలింపు వ్యవస్థలను నిర్మించాలని కోరారు. జీసీ లింక్‌లో భాగంగా సాగర్‌కు నీటిని తరలించే కన్వేయర్ సిస్టమ్?లో చాలా వరకు వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని, ఆ ముంపును తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

తరలించే నీటిని నేరుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి తీసుకెళ్లవద్దని, సాగర్ టెయిల్ పాండ్‌కు తరలించి అక్కడి నుంచి తీసుకెళ్లాలని సూచించారు. సాగర్‌లోకి నీటిని తరలిస్తున్నందున అక్కడ రీప్లేస్‌మెంట్‌కు బదులుగా కర్నాటకకు ఆల్మట్టిలో అదనంగా 16 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారని, దాని వల్ల తెలంగాణకు గేట్‌వే ప్రాజెక్ట్ అయిన జూరాలకు ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాగర్ నుంచి రీప్లేస్‌మెంట్ అన్నారే తప్ప ఎలా అనే వివరాలను మాత్రం చెప్పలేదన్నారు. ఈ నిర్ణయంపై పునఃసమీక్షించాలన్నారు. అన్ని రాష్ట్రాలూ సమ్మతించాకనే మెమోరాండమ్ ఆఫ్ అగ్రిమెంట్‌పై ముందుకు వెళ్లాలని, ఇప్పుడే చేస్తే అది తొందరపాటే అవుతుందని స్పష్టం చేశారు.

# ఎవ్వరు అడ్డొచ్చినా 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతాం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారని కామెంట్ చేశారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన విషయంలోనూ ఇదే జరుగుతోందని అన్నారు. కానీ, భావి తరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతామని, ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్‌గా నిలుపుతామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమని అన్నారు. నేడు మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి – ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ – న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయవచ్చిన స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీపీఐ ప్రెసిడెంట్ ఎన్‌కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో–ఆర్డినేటర్ (టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీపీఐ – తెలంగాణ రీజినల్ ఛాప్టర్ చైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# మా వస్తువులు కొనకండి.. కొనమని ఎవరూ బలవంతం చేయరు..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు విదేశాంగ మంత్రిజైశంకర్. మీరు సుంకాలు పెంచుతూ పోతే మేం మాకేం నష్టమేమీ లేదు.. మా వస్తువులు కొనకండి.. మిమ్మల్ని మా వస్తువులు కొనమని ఎవరూ బలవంతం చేయడం లేదంటూ కౌంటర్ ఇచ్చారు జైశంకర్. ఢిల్లీలో జరిగిన ఎకనామిక్స్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం 2025లో ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జైశంకర్.. రష్యానుంచి చమురు ఇతర ఉత్పత్తులు భారత్ దిగుమతి చేసుకుంటే మీకేం నష్టం.. మీకేదైన సమస్య ఉంటే కొనకండి.. ఎవరూ మిమ్మల్ని కొనమని బలవంతం చేయరు అని అన్నారు. అమెరికాతో వ్యాపారం చేసేవారు ఇతరులతో వ్యాపారం చేయకూడదని చెప్పడం సరికాదన్నారు. మాకు మా రైతుల ప్రయోజనాలు, కింది స్థాయి ఉత్పత్తిదారుల ప్రయోజనాలు ముఖ్యం.. వాటిని కాపాడుకునేందుకు మేం కట్టుబడి ఉన్నామని జైశంకర్ అన్నారు. రైతు ప్రయోజనాల విషయంతో రాజీపడం అని తేల్చి చెప్పారు. రష్యానుంచి చమురు కొనుగోలు విషయంలో చైనా , ఈయూ, ఇతర దేశాలు కూడా ఇలాంటి సంబంధాలు కలిగి ఉన్నాయి. అయినప్పటికీ వాటికి సుంకాలు పెంచలేదని స్పష్టం చేశారు.

అమెరికా భారత్ ను వేరు చేస్తుందా?

అమెరికా పక్షపాత ధోరణిని అమలు చేస్తుందని జైశంకర్ ఆరోపించారు. చైనా పెద్ద ఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంది. అయిన వాణిజ్య పరమైన సుంకాలు లేవని జైశంకర్ అన్నారు. భారత్ చమురు కొనుగోలు ప్రపంచ మార్కెట్ విధానాలు, అవసరాలకు అనుగుణంగా ఉంది.. ప్రపంచ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు రష్యానుంచి చమురు కొనుగోలును గతంలో అమెరికా స్వయంగా భారత్ ను ప్రోత్సహించిందన్నారి గుర్తు చేశారు జైశంకర్.

# హైదరాబాద్‌కు రండి.. ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కి కేటీఆర్ ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది చివరలో భారత్‌లో మా మొదటి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో ఇండియాను సందర్శించనున్నట్లు తెలిపారు. దేశంలో ఏఐ వాడకం అద్భుతంగా ఉందని, గత సంవత్సరం నుంచి చాట్‌జీపీటీ వినియోగదారుల సంఖ్య ఏకంగా నాలుగు రెట్లు పెరిగిందని ప్రశంసించారు. ఈ మేరకు భారత్‌లో మరిన్ని పెట్టుడులు పెట్టడానికి మేము ఉత్సాహంగా ఉన్నామని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. దీనిపై ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. హదరాబాద్ నుంచి సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు. ఇండియాకి స్వాగతం అంటూ శనివారం ఎక్స్ వేదికగా కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ భారతదేశానికి సరైన ప్రవేశ ద్వారామని, ఓపెన్ ఏఐ వంటి సంస్థలకు ఈ నగరం అనువైన స్థావరం అని కేటీఆర్ రాసుకొచ్చారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఇన్నోవేషన్ వ్యవస్థ కలిగి ఉందని తెలిపారు. టీ హబ్, వీ హబ్, టీ వర్క్స్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ వంటి సంస్థలు ఉన్నాయని తెలిపారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, ఆపిల్, క్వాల్కమ్ లాంటి ప్రపంచ టెక్ దిగ్గజాలకు ప్రాధాన్యతనిచ్చే కేంద్రంగా ఉందన్నారు. వరుస ప్రభుత్వాలు తెలంగాణను భారతదేశ ఏఐ క్యాపిటల్ సిటీగా చేయడానికి సాహసోపేతమైన చర్యలు తీసుకున్నాయని వెల్లడించారు. 2020ని ఏఐ సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. ఓపెన్ ఏఐ కార్యకలాపాలకు ఎంతో అనుకూలంగా హైదరాబాద్ ఉంటుందని కేటీఆర్ ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# ఒక్కసారి ఆ తీర్పు చదివి ఉంటే బాగుండేది



ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. సల్వాజుడం తీర్పు సుప్రీంకోర్టుదేనని, అది తన వ్యక్తిగత అభిప్రాయం కాదని అమిత్ షాకు కౌంటర్ ఇచ్చారు. ఆ తీర్పును తానే రాశా.. కానీ తీర్పు తన వ్యక్తిగతం కాదు. తీర్పు సుప్రీంకోర్టుదని అమిత్ షా వ్యాఖ్యలను తోసిపుచ్చారు.

ఈ తీర్పు వెలువరించే సమయంలో బెంచ్?పై నాతో పాటు మరో న్యాయమూర్తి కూడా ఉన్నారని గుర్తు చేశారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. అమిత్ షా తనపై ఆరోపణలు చేసే ముందు సల్వాజుడుం మొత్తం తీర్పును చదివి ఉంటే బాగుండేదని.. ఒకవేళ ఆయన తీర్పును చదివి ఉంటే బహుశా ఇలా మాట్లాడే వారు కాదని అన్నారు. ఏదైనా డిబేట్‌లో డీసెన్సీ అనేది ఉండాలని, అయితే ఈ విషయంలో హోం మంత్రితో తాను డిబేట్ చేయదలచుకోవడం లేదని స్పష్టం చేశారు.

అమిత్ షా ఏమన్నారంటే..?

ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పోటీకి దిగడంతో ఆయనపై అమిత్ షా సంచలన ఆరోపణలు చేశారు. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని ఆరోపించారు అమిత్ షా. 2011లో సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు సల్వాజుడుంపై తీర్పు ఇచ్చారని.. ఆయన ఆ తీర్పు ఇచ్చి ఉండకపోతే 2020 నాటికే దేశంలో మావోయిస్టు తీవ్రవాదం ముగిసి ఉండేదన్నారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి రెడ్డి నక్సల్ భావజాలం నుంచి స్ఫూర్తి పొందారు కాబట్టే అలాంటి తీర్పు వెలువరించారని సెన్సేషనల్ ఎలిగేషన్స్ చేశారు అమిత్ షా. ఓ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిపై అమిత్ షా ఇలాంటి ఆరోపణలు చేయడం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అసలు సల్వాజుడుం తీర్పు ఏంటి అని పలువురు ఇంటర్ నెట్లో వెతుకుతున్నారు.

# క్రికెట్ బ్యాట్ కోసం వెళ్లి సహస్రను వెంకట్ హత్య చేశాడు

కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఐదు రోజుల క్రితం జరిగిన బాలిక సహస్ర హత్య కేసును ఛేదించిన పోలీసులు ఈ కేసులో విస్తుపోయే విషయాలు వెల్లడించారు. క్రికెట్ బ్యాట్ ను దొంగిలించేందుకు వెళ్లి వస్తుండగా.. బాలిక చూసి అరవడంతో హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. ఓటీటీ ప్లాట్ ఫామ్స్ లో క్రైమ్ సీన్స్ చూసే బాలికను హత్య చేసినట్లు తేల్చారు. సహస్ర హత్య కేసులో బాలుడు సైకోలా ప్రవర్తించినట్టు అతను రాసుకున్న నోట్స్.. ప్రవర్తించిన తీరును బట్టి అర్థం అవుతుందని, పోలీసుల విచారణలో పక్కా ప్రొఫెషనల్ క్రిమినల్ గా వ్యవహరించిన బాలుడు.. హత్య చేసి ఆధారాలు మాయం చేయడం నేర్చుకున్నట్లు స్పష్టం అవుతుంది.

సంచలనం సృష్టించిన ఈ కేసుకు సంబంధించి సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి వెల్లడించారు. ఈనెల 18న ఉదయం సహస్ర హత్య జరిగిందని, ఈ కేసులో 3 రోజుల వరకు పెద్దగా క్లూస్ ఏమీ దొరకలేదని, ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. ఈ కేసులో కొంతమందిని అనుమానితులుగా గుర్తించి ఆ దిశగా విచారణ చేపట్టగా హత్య జరిగిన రోజు, ఆ ఇంటి గోడ సమీపంలో ఓ బాలుడు తచ్చాడినట్లు పక్క ఇంట్లో ఉండే బాలుడు ఇచ్చిన సమాచారంతో ఈ కేసును లోతుగా దర్యాప్తు చేపట్టమన్నారు. సహస్రను పక్క ఇంటిలో ఉన్న 14 ఏళ్ల బాలుడు మర్డర్ చేసినట్లు తేలిందన్నారు. సహస్ర ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో మృతురాలు తమ్ముడు, హత్యకు పాల్పడ్డ బాలుడు క్రికెట్ ఆడుకునే వారని, తనకు ఇవ్వమంటే ఇవ్వలేదని, స్ట్రోక్ బాగున్న ఆ బ్యాట్ ను ఎలాగైనా దొంగలించాలని అనుకున్నాడని తెలిపారు. ఇందుకోసం పక్కాగా ప్లాన్ చేసుకున్నాడని, ఎలా దొంగతనం చేయాలి, ఎవరైనా చూస్తే అక్కడి నుంచి ఎలా తప్పించుకోవాలి, క్లూస్ దొరకక కుండా ఏం చేయాలి అనేది నెల రోజుల క్రితమే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నట్లు తమ విచారణలో తేలిందని సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. అనుకున్న విధంగా ఈనెల 18న ఉదయం పక్కింటిలోని ఇంట్లోకి చొరబడి బ్యాట్ దొంగతనం చేసి తీసుకుని వస్తుండగా బాలిక సహస్ర చూడడంతో తన వెంట తీసుకువెళ్లిన కత్తితో బాలికను ఇష్టం వచ్చిన విధంగా పొడిచి చంపాడు.


అనంతరం అక్కడే మర్డర్ చేసిన కత్తిని కడిగేసి, టెర్రస్ గోడ దూకి తన ఇంటిలోకి వెళ్లి రక్తపు మరకలు అంటిన బట్టలను వాషింగ్ మెషిన్ లో వేశాడని, అనంతరం ఏమీ తెలియనట్టు మళ్లీ అదే ప్రాంతంలో ఏమీ తెలియనట్టు తిరగాడని సీపీ తెలిపారు. ఓ బాలుడి ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు చేపట్టగా దర్యాప్తును పక్కదారి పట్టించేలా లేని విషయాలు చెప్పాడన్నారు. పక్కా ఆధారాలతో ఈ కేసును ఛేదించామని అన్నారు. మర్డర్ కు పాల్పడిన చోట క్లూస్ దొరికాయని, స్క్రిప్ట్ ప్రకారమే ఇదంతా చేశాడని, నెల రోజుల నుంచి ఇదంతా ప్లాన్ చేసుకున్నాడన్నారు.

ఓటీటీలు, మిస్టరీ సినిమాలు చూసే ఇదంతా చేశాడని అన్నారు. ఈ విషయం బాలుడి తల్లిదండ్రులకు కూడా తెలియదని, మర్డర్ జరిగిన తర్వాత కాస్త భయం భయంగా ఉన్న బాలుడిని అతని తల్లి నువ్వేమైన చేశావా అని అడిగితే రెండవ రోజు నువ్వే పట్టించేలా ఉన్నావని అన్నాడని ఆమె విచారణలో తెలిపిందన్నారు.

మేము డబ్బులు ఇవ్వకుండానే ఓ ఫోన్ కొనుకున్నాడని, అదెలా వచ్చింది అంటే సమాధానం చెప్పలేదని తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు సీపీ తెలిపారు. అనంతరం బాలుడిని ప్రశ్నించడంతో నిజం అంగీకరించినట్టు తెలిపారు. బ్యాట్ కొనీయమని అడగాలంటే ఫ్యామిలీ మొత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని అందుకే దొంగతనం చేసేందుకు సిద్ధమైనట్లు బాలుడు విచారణలో వెల్లడించినట్లు సీపీ వెల్లడించారు. సహస్ర హత్య కేసులో నిందితుడైన బాలుడిని జువైనల్ హోంకు తరలించారు పోలీసులు. అంతకుముందు అతడిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

# పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్దమా - హరీశ్‌రావు ధ్వజం

మొదటి పేజీ తరువాయి



ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. యూరియా బస్తాలు ఇవ్వాలంటూ రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకొని వేడుకున్నది అబద్ధమా? దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టించింది అబద్ధమా? కాంగ్రెస్ ఎంపీల యూరియా పోరాటం ఫలించిందని చెప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి సిగ్గనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేతగాని తనం వల్లనే కదా ఈరోజు రైతులకు ఇన్ని కష్టాలు వచ్చిందని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి ముందు చూపు లేకపోవడం వల్లనే కదా రైతులు కన్నీళ్లు పెట్టాల్సి వస్తున్నదని మండిపడ్డారు.

తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, బంగారం మాట దేవుడెరుగు యూరియానే బంగారంగా మార్చిండని హరీశ్‌రావు విమర్శించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులైపారిస్తున్న రేవంత్ రెడ్డి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిండని మండిపడ్డారు. బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదు, పరిపాలన చేయడం అంటే అని ఎద్దేవా చేశారు. నమ్మి నయవంచన చేసినంత సులువు కాదు, కేసీఆర్ అందించిన రైతు సంక్షేమాన్ని కొనసాగించడం అంటే అని పేర్కొన్నారు. నాటి రోజులు తెస్తామని పదే పదే చెప్పే రేవంత్ రెడ్డి..అన్నమాట నిలుపుకుంటున్నడని.. మళ్లా కాంగ్రెస్ దుర్మార్గ పాలన నాటి పాత రోజులను తీసుకొచ్చిండని మండిపడ్డారు.తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని హరీశ్‌రావు అన్నారు. ఏనాడూ రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని గుర్తుచేశారు. యూరియా కొరతకు కారణమైన వారే ఈరోజు యూరియా పేరు చెప్పి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. మిస్ వరల్డ్ పేరిట రెండు నెలలు పాలనను గాలికి వదిలేసిండు తప్ప, ఎరువులు, విత్తనాల గురించి సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేయలేదని.. బాధ్యత లేదు, ప్రణాళిక లేదు, కార్యచరణ లేదని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నాం, బాధ్యతగా ఉండాలనే సోయి కూడా లేకుండా ప్రతి వైఫల్యాన్ని బీఆర్ఎస్, కేసీఆర్ పై వేస్తూ రంకెలేయడం తప్ప 22 పాలనలో ఒరగబెట్టిందేమిటి అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేతగాని తనం వల్లనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఈరోజు యావత్ రైతాంగాన్ని యూరియా కోసం నడి రోడ్డుపై నిలబెట్టిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది సాగు నీళ్లు ఇవ్వడంలో ఫెయిల్, పంట కొనుగోళ్లలో ఫెయిల్, 500 బోనస్ ఇవ్వడంలో ఫెయిల్, రైతు భరోసా ఇవ్వడంలో ఫెయిల్, రైతు రుణమాఫీలో ఫెయిల్, చివరకు యూరియా సరఫరా చేయడంలో ఫెయిల్ అని విమర్శించారు. రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్న ఈ ప్రభుత్వం ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వమని మండిపడ్డారు.

దేశానికి అన్నం పెట్టే రైతుల చేతులతో కాళ్లు మొక్కించుకుంటున్న ఈ ప్రభుత్వానికి తప్పకుండా ఉసురు తగులుతుందని అన్నారు. రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మీద నిందలు మాని, రైతుల యూరియా కష్టాలపై ఇప్పటికైనా దృష్టి సారించాలని హితవు పలికారు. యూరియా, ఎరువుల కొరత పై సమీక్ష నిర్వహించి, రైతాంగానికి అవసరమైన యూరియా వెంటనే సరఫరా చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# యూరియా కొరతపై కేటీఆర్ డ్రామాలు - సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 26న బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ఓట్ చోరీ పాదయాత్రలో పాల్గొంటానని సీఎం పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి యూరియా కొరతపై డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. కేటీఆర్ యూరియా ఇచ్చే పార్టీకి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిస్తాననడం వారి ద్వంద వైఖరి బయటపడిందని విమర్శించారు. యూరియా కోసం నాలుగుసార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్‌ను కలిశానని తెలిపిన సీఎం... యూరియా పంపిణీపై క్షేత్రస్థాయిలో మానిటరింగ్ పెంచాలని సూచించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై నలుగురు మంత్రులతో కూడిన కమిటీని వేస్తున్నట్టు పేర్కొన్నారు. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా కేబినెట్ లో చర్చించి స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

## మోత్కూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ప్రదీప్ శర్మ ప్రధాన కార్యదర్శి గా కాపర్తి సైమన్





మోత్కూర్ , 23ఆగస్టు (క్రాంతి న్యూస్): మోత్కూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మోత్కూర్ ప్రదీప్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుని ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించగా సభ్యులు మోత్కూర్ ప్రదీప్ శర్మ (మన తెలంగాణ)ను మూడోసారి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కాపర్తి సైమన్ (I-న్యూస్), ఉపాధ్యక్షులుగా మాశెట్టి వెంకన్న(సూర్య), మోత్కూర్ రమేష్ (HM TV), సహాయ కార్యదర్శిగా కూరెళ్ల విష్ణు (నవ తెలంగాణ), కోశాధికారిగా కూరెళ్ల వెంకట్ (10TV), ప్రచార కార్యదర్శిగా సూరారం నర్సింహ (ముద్ర), గౌరవాధ్యక్షులుగా కడారు నర్సింహారెడ్డి (దిశ), గుండు ప్రసాద్ (బిగ్ టీవీ ), గౌరవ సలహాదారులుగా చేపూరి అనిల్, పోచం కన్నయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వారాల రాఖేష్, అవిశెట్టి యాదగిరి, గంట శ్రీనివాస్ రెడ్డి, ఈదునూరి కృష్ణ, గాదెనబోయిన నాగరాజు, నర్రె సురేష్, గోపాల్దాస్ సాయి(స్వతంత్ర టీవీ), గనగాని రాజేష్, కూరెళ్ల రాజశేఖర్, బొడిగె శ్రీహరి, వారాల నరేష్, బిళ్లపాటి మహేందర్ రెడ్డి, జిట్ట రాములు, ముశం శ్రీను, బిళ్లపాట్ గోవర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు.

## మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.375 కోట్లు విడుదల



హైదరాబాద్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.375 కోట్లు విడుదల చేశారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి వీటిని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో మూసీ నదికి పునరుజ్జీవం కల్పించనున్నారు. స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేయనున్నారు. పర్యాటకంగాను ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే.

## సహస్ర తల్లి సంచలన ఆరోపణలు.. వాళ్ల పాత్ర కూడా ఉంది!




హైదరాబాద్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): తమకు న్యాయం చేయాలంటూ సహస్ర తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించారు. రాస్తారోకో చేయడానికి సహస్ర తల్లిదండ్రులు ప్రయత్నించారు. పోలీసులు నచ్చజెప్పారు. ఈ క్రమంలో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కూకట్‌పల్లి రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కూకట్‌పల్లి నుంచి ఎర్రగడ్డ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. తమకు న్యాయం చేయకపోతే సూసైడ్ చేసుకుంటామంటూ సహస్ర తల్లి హెచ్చరించారు. న్యాయం చేసేవరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని.. నిందితుడిని తమ ముందుకు తీసుకురావాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఒక్క బ్యాట్ కోసం ఇంత దారుణం చేస్తారా? తమ కుమార్తె హత్య వెనుక బాలుడి తల్లిదండ్రుల పాత్ర కూడా ఉందని సహస్ర తల్లి ఆరోపిస్తోంది.బాలిక సహస్ర తండ్రి మీడియాతో మాట్లాడుతూ.. ఆ అబ్బాయికి కొంచెం కూడా భయం లేదని.. అతడికి ఉరిశిక్ష వేస్తేనే తన కూతురికి ఆత్మ శాంతి కలుగుతుందన్నారు. తన కూతురిని హత్య చేసి పోలీసులనే పక్క దారి పట్టించే ప్రయత్నం చేశాడన్నారు. “నా కూతురిని చంపేసి.. నా కొడుకును ఓదార్చుతున్నాడు. ఇతనే చంపాడని నేను కూడా నమ్మలేదు. అసలు ఈ భూమి మీద అతడు ఉండకూడదు. కఠిన శిక్ష విధించాలి” అని సహస్ర తండ్రి డిమాండ్ చేశారు.

సహస్ర హత్య కేసులో కీలక విషయాలను పోలీసులు వెల్లడించారు. బాలుడే హత్య చేశాడని అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. దొంగతనం కోసం నెల రోజుల ముందే ప్లాన్ చేసినట్టు చెప్పుకొచ్చారు. బాలిక హత్యకు వాడిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నట్టు స్పష్టం చేశారు. బ్యాట్ కోసం ఇదంతా జరిగినట్టు తేలిందన్నారు.కూకట్‌పల్లి సహస్ర హత్య కేసుకు సంబంధించి సీపీ అవినాష్ మహంతి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ మహంతి మాట్లాడుతూ..‘ఈనెల 18వ తేదీన బాలిక హత్య జరిగింది. మూడు రోజుల వరకు సరైన క్లూ దొరకలేదు. శుక్రవారం బాలుడిని పట్టుకున్నాం. పక్కింట్లో ఉన్న 14 ఏళ్ల బాలుడే సహస్రను హత్య చేశాడు. క్రికెట్ బ్యాట్ దొంగలించేందుకే సహస్ర ఇంటికి బాలుడు వెళ్లాడు. బ్యాట్ తీసుకుని వెళ్తుంటే సహస్ర చూసింది.వెంటనే దొంగ దొంగ అని అరిచింది. దీంతో, సహస్రను బెడ్‌రూంలోకి తోసి ఆమెపై కత్తితో దాడి చేశారు. బాలికను తోసేసి కళ్లు మూసుకుని కత్తితో పొడిచాడు. ఇంట్లో ఎవరూ లేరు అనుకుని దొంగతనానికి వెళ్లాడు.. కానీ, బాలిక ఉండేసరికి ఆమెపై దాడి చేశాడు. ఈ కేసులో బాలుడిని ప్రశ్నిస్తే విచారణను తప్పుదారి పట్టించే సమాధానాలు చెప్పాడు. బాలిక హత్యకు వాడిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నాం. బాలుడే హత్య చేశాడని అన్ని ఆధారాలు ఉన్నాయి.

## ప్రిన్సిపల్‌పై కోపంతో మంచినీళ్ల ట్యాంకులో పురుగుల మందు కలిపిన టీచర్



భూపాలపల్లి ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): ప్రిన్సిపల్‌పై కోపంతో మంచినీళ్ల ట్యాంకులో పురుగుల మందు కలిపాడో టీచర్. ఆ నీళ్లు తాగిన విద్యార్థులు దవాఖాన పాలయ్యారు. భూపాలపల్లి పట్టణంలో సుభాష్ కాలనీలో ఉన్న అర్బన్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో కలుశుత నీరు తాగడంతో 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం రవ్వతో చేసిన టిఫిన్‌ను తిన్న తర్వాత వారంతా వాంతులు చేసుకున్నారు. దీంతో పాఠశాల సిబ్బంది వారిని జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. ప్రిన్సిపల్ ఫిర్యాదుతో కలెక్టర్‌తోపాటు ఎస్పీ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలోని ఆర్వోప్లాంట్ కు సంబంధించిన కెమికల్స్ ద్వారా తాగునీరు ఏమైనా కలుషితమైందా అనే విషయాన్ని తెలుసుకునేందుకు డీఎంహెచ్ఓ గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. తాగునీటిని ఓ బాటిల్ లో శాంపిల్ తీసి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకటనర్సయ్యపై కోపంతో మంచినీళ్ల ట్యాంక్‌లో ఉపాధ్యాయుడు రాజేందర్ పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. దీంతో రాజేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

## తెలంగాణ పౌరుషం ఉన్నోళ్లం..

### గాజులు పెట్టుకొని కూర్చోలేదు : మర్రి జనార్దన్ రెడ్డి




నాగర్‌కర్నూల్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు భయపడే ప్రసక్తే లేదని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణ పౌరుషం ఉన్నోళ్లం.. గాజులు పెట్టుకొని కూర్చోలేదు అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. అచ్చంపేట మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మర్రి జనార్ధన్ రెడ్డి పాల్గొని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలోనే బీఆర్ఎస్ నాయకులపై, కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టారు.. ఇప్పుడు ఈ కేసులకు భయపడేది లేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొంత మంది పోలీసులు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా పని చేస్తున్నారు.. రేపు మా ప్రభుత్వం వచ్చాక వాళ్ళని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని తేల్చిచెప్పారు.

మనం కేసులకు భయపడితే తెలంగాణ వచ్చేదా..? ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు ఎందుకు భయపడుతున్నారు. న్యాయం, ధర్మం మన వైపు ఉన్నంతవరకు మనని ఎవరు ఏం చేయలేరు అని మర్రి జనార్ధన్ రెడ్డి తేల్చిచెప్పారు.

## సిరిసిల్ల నేతన్నలకు అండగా నిలవండి.. డిప్యూటీ సీఎంకు కేటీఆర్ లేఖ



హైదరాబాద్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్):సిరిసిల్లలోని పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవర్ లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు.

**ఆత్మహత్యలే శరణ్యం**

సిరిసిల్ల ప్రాంతం పవర్ లూమ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ సుమారు 25 వేల పవర్ లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో కేటీఆర్ వివరించారు. మారిన మార్కెట్ పరిస్థితులతో బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు తమ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని దొరకడంతో పాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం పవర్ లూమ్ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

**హైకోర్టు ఆదేశాలతో పెరిగిన భారం**

కుటీర పరిశ్రమల కేటగిరీ కింద 50 శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు, అవగాహన లోపంతో ఎస్ఎస్ఐ యూనిట్లుగా మారడంతో ఇండస్ట్రీ-3 కేటగిరీ కిందకు వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు, అలాగే 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ.35.48 కోట్లు బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, ఫలితంగా వారికి పవర్ లూమ్స్ నడపడం కష్టంగా మారిందన్నారు.

**ఆర్థిక ఇబ్బందుల్లో సీఈఎస్ఎస్**

పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో, సిరిసిల్ల కో-ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని కేటీఆర్ తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా చెల్లించలేకపోతున్నదని వివరించారు.

**తక్షణ చర్యలు అవసరం**

నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీఆర్ కోరారు. బకాయిలను మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## ‘మఖ్దూం భవన్ నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు’.. సురవరం అంతిమయాత్ర



హైదరాబాద్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) శుక్రవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్ నుంచి మఖ్దూం భవన్‌కు తరలించనున్నట్లు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు, ప్రజల సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మఖ్దూం భవన్‌లో భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమ యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్యవిద్యార్థుల పరిశోధన కోసం సాయంత్రం 5 గంటలకు సురవరం పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.




# సైబర్ నేరగాళ్లకు చిక్కిన టీడీపీ మంత్రి అల్లుడు..



నెల్లూరు ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాలు, పోలీసులు ఎన్నిచర్యలు తీసుకున్న సైబర్ నేరాలు మాత్రం ఆగడం లేదు. రోజుకో కొత్త పద్ధతిలో పేద, ధనిక అని తేడా లేకుండా అందరి నుంచి డబ్బులు కాజేస్తున్నారు. అందినకాడికి దోచుకుంటూ.. ఎవరికి తెలియకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. అధికారులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టిన ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారని చెప్పవచ్చు. ప్రముఖుల నుంచి సామాన్య ప్రజల వరకు ప్రతి ఒక్కరూ ఈ సైబర్ నేరాలకు గురవుతునే ఉన్నారు. తాజాగా ఓ మంత్రి అల్లుడు సైబర్ నేరాగాళ్ల చేతికి చిక్కాడు.

పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అల్లుడు పునీత్‌ను సైబర్ కేటుగాళ్లు టార్గెట్ చేశారు. పునీత్ కంపెనీలో సైబర్ మోసానికి పాల్పడ్డారు. పునీత్ పేరుతో తన అకౌంటెంట్‌కు సైబర్ కేటుగాళ్లు మెసేజ్ చేశారు. అత్యవసరంగా రూ.1.40 కోట్లు కావాలంటూ.. అకౌంట్‌కు డబ్బులు పంపుమని మెసేజ్ పంపారు. నిజంగానే పునీత్ మెసేజ్ చేశారనుకున్న అకౌంటెంట్, కేటుగాళ్ల అకౌంట్‌కు డబ్బులు పంపించాడు. కొద్ది సేపటి తరువాత మోసపోయినట్లు గ్రహించిన అకౌంటెంట్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని.. సైబర్ నేరగాళ్లను ట్రేస్ చేసి పట్టుకున్నారు. యూపీకి చెందిన సంజీవ్, అరవింద్ అనే వ్యక్తులు సైబర్ నేరానికి పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

# వైసీపీ కార్యకర్తల్లారా.. పండుగ చేసుకోండి.. నన్ను మాత్రం కెలకొద్దు - ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




నెల్లూరు ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): వైసీపీ నేత ఆనం విజయకుమార్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై కూడా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. నిజంగా నేను రాజకీయ, ఆర్థిక దందాలు చేసి ఉంటే.. నాపై మీ జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. 18 నెలలు జగన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలలు అయ్యింది.. మేం ఏ వైసీపీ నేతపై అయినా, కార్యకర్తపై అయినా దాడులు చేశామా? వేధించామా? వెంటాడామా? అక్రమ కేసులు పెట్టామా? చెప్పాలని అన్నారు.

నెల్లూరులో శనివారం నాడు నిర్వహించిన మీడియా సమావేశంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఆ 18 నెలలు మీరు చేసిన పాపాలు, దుర్మార్గాలు గుర్తుకొస్తూనే ఉంటాయని అన్నారు. నన్ను, నా కుటుంబసభ్యులను, నా తమ్ముడిని వేధించినట్టే వేధించాలనే అనుకుంటే.. ఇప్పుడు కచ్చితంగా చుక్కలు చూపించేవాడిని అని వ్యాఖ్యానించారు. కానీ మా అధినేత చంద్రబాబు గీత దాటితే తాటతీస్తారని చెప్పారు. చట్టవిరుద్ధమైన ప్రతీకార చర్యలకు పాల్పడవద్దని చంద్రబాబు, లోకేశ్ క్లియర్‌గా చెప్పారు కాబట్టే.. మేం చేతులు కట్టేసుకున్నామని స్పష్టం చేశారు. నాకే కాదు రాష్ట్రంలోని అందరికీ అవే ఆదేశాలిచ్చారని వివరించారు. వైసీపీ కార్యకర్తల్లారా.. పండుగ చేసుకోండి.. నన్ను అనవసరంగా కెలకొద్దు అని సూచించారు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేద్దాం.. ప్రజల కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. చిల్లర మాటలు, చిల్లర రాజకీయాలు కొనసాగిస్తే మాత్రం అందుకు పదింతలు బదులిస్తామని హెచ్చరించారు.


నెల్లూరు రౌడీ శ్రీకాంత్ పెరోలుపై వివరణ

నెల్లూరు రౌడీషీటర్ శ్రీకాంత్‌కు పెరోలు విషయంలో టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సిఫారసు చేశారని వైసీపీ ఆధారాలు చూపిన నేపథ్యంలో ఆయన స్పందించారు. తనపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. శ్రీకాంత్‌కు పెరోలు ఇవ్వాలని ఆయన తండ్రి, సోదరుడు వస్తే సిఫారసు లేఖ ఇచ్చానని చెప్పారు. వివిధ సమస్యలతో వచ్చేవారికి ఎమ్మెల్యేలు ఈ లేఖలు ఇస్తారని.. అధికారులు వాటిని పరిశీలించి సమాధానం పంపిస్తారని వివరించారు. శ్రీకాంత్‌కు పెరోలు ఇవ్వాల్సిందిగా తానూ, ఎమ్మెల్యే పాశం సునీల్ సిఫారసు లేకలు ఇచ్చినప్పటికీ వాటిని హోం శాఖ పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు.

నా జీవితంలో ఇక ఎవరికీ సిఫారసు లేఖ ఇవ్వను

తాను ఇచ్చిన సిఫారసు లేఖను తిరస్కరిస్తూ అధికారులు జూలై 16వ తేదీన సమాధానం పంపించారని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. జూలై 30న అధికారులు శ్రీకాంత్‌కు పెరోలు మంజూరు చేశారని పేర్కొన్నారు. తమ లేఖను తిరస్కరించి 14 రోజుల తర్వాత పెరోలు మంజూరు చేశారని చెప్పారు. పెరోలు అంశంపై విచారణ చేయిస్తున్నామని హోంమంత్రి చెప్పారని.. నా సిఫారసు లేఖను తిరస్కరించిన 14 రోజుల్లోనే అధికారులు పెరోలు ఎలా ఇచ్చారోనని అనుమానం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఇదే శ్రీకాంత్ రెడ్డికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సిఫారసు లేఖలు ఇచ్చారని కోటంరెడ్డి తెలిపారు. వారిని తప్పుబట్టడం లేదని.. ప్రజా ప్రతినిధుల వద్దకు రకరకాల బాధలతో ప్రజలు వస్తుంటారని.. ఆ లేఖల ఆధారంగా అధికారులు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాజకీయ జీవితంలో ప్రతిదీ గుణపాఠమేనని.. ఇకపై జీవితంలో ఎవరికీ పెరోలుకు సిఫారసు లేఖ ఇవ్వనని తేల్చిచెప్పారు.

# ఏదీ వృథా కాదు.. చెత్త ద్వారా సంపద సృష్టించొచ్చు: సీఎం చంద్రబాబు



కాకినాడ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): ఏదీ వృథాకాదని, చెత్త ద్వారా సంపద సృష్టించొచ్చని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆయన గత ప్రభుత్వం తీసుకొచ్చిన చెత్తపన్ను విధానంపై విమర్శలు కురిపించారు. జగన్ హయాంలో చెత్తకు పన్ను వేశారని, కానీ తీయలేదని ఎద్దేవా చేశారు. ప్రజారోగ్యాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లోని చెత్తా చెదారాన్ని అక్టోబర్ 2 నాటికి తొలగిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచంలో ఏదీ వేస్ట్ కాదని, చెత్తతో కూడా సంపద సృష్టించొచ్చని చెప్పారు. ప్రజల ఆలోచనా విధానం మారాలని అప్పుడే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# 3 నెలల్లో ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి: ఏపీ జేఏసీ అమరావతి



అమరావతి ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): రాష్ట్రంలో ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కోరారు. ఈనెల 20న సీఎస్‌తో జరిగిన సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామన్నారు. రాబోయే 3 నెలల్లో తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈమేరకు తీర్మానాలు చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్స్ రెండేళ్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దామోదరరావు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్‌గా మారిన మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. యువతిపై అత్యాచారం




నంద్యాల ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్):నంద్యాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఒక సంఘటన తీవ్ర కలకలం రేపుతుంది. విశాఖపట్నం నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఏడాదిన్నర పాపతో కలిసి అర్ధరాత్రి దిగిన ఓ యువతి, ఆళ్లగడ్డ వెళ్ళేందుకు రైల్వే స్టేషన్ బయట ఆటోలో ఎక్కింది. ఆ ఆటో డ్రైవర్ సమర సింహ, యువతి ఒంటరిగా ఉండటంతో అవకాశాన్ని ఉపయోగించుకుని కిడ్నాప్‌కు పాల్పడ్డాడు. ఆటోను దారి మళ్లించి దిబగుంట్లకు తీసుకెళ్లాడు. అదే సమయంలో కుండపోత వర్షంలో యువతిపై అత్యాచార యత్నం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే, వాహనాల రాకపోకలతో భయపడిన సమర సింహ ఆమెను వదిలేశాడని చెప్పుకొచ్చారు.

ఆ తర్వాత యువతి సమీపంలోని ఓ హోటల్‌లో తెల్లవారే వరకు తలదాచుకుని.. ఆ తర్వాత రోజు ఆళ్లగడ్డ చేరుకుని భర్తతో కలిసి నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చింది. సీసీ ఫుటేజ్, సెల్‌ఫోన్ లొకేషన్స్ ఆధారంగా సమర సింహను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి, రిమాండుకు పంపారు. ఇక్కడ, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆటో డ్రైవర్ సమర సింహ ఎం.టెక్ చదివి, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా డ్యూటీ కూడా చేశాడు. కానీ, కుటుంబ సమస్యల కారణంగా నంద్యాలకు వచ్చి ఆటో నడుపుకుంటున్నట్లు సమాచారం.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కలిసి పోరాడుదాం..!

## డిప్యూటీ సీఎం పవన్‌కు బొత్స సూచన..



ఏపీ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్):ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూకబ్జాలు, దోపిడీ యథేచ్ఛగా చేసుకోమని ఎమ్మెల్యేలను, మంత్రులను సీఎం చంద్రబాబు వదిలేశారని మాజీ మంత్రి బొత్స సత్యనారనాయణ ఆరోపించారు. సీరియస్ గా ఉండమని హెచ్చరించిన వారిలో పరివర్తన కనిపించడం లేదు.. ఆధారాలతో సహా అక్రమాలను బయటపెట్టిన ఇప్పటి వరకు ప్రభుతవం చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వంలో బిజినెస్ రూల్స్ అనేవే లేకుండాపోయాయి.. ఏదైన అడిగితే ఎంక్వైరీ చేస్తామంటున్నారు.. మంత్రులు సంతకం పెట్టిన తర్వాత విచారణ చేస్తామనటం ఏమిటి నాన్సెస్ కాకపోతే అని బొత్స మండిపడ్డారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం..

ఇక, వికలాంగులు పెన్షన్లలో అర్హులైన వారిని తొలగించే ప్రయత్నం జరుగుతోందని వైసీపీ నేత బొత్స అన్నారు. వెరిఫికేషన్ కు అవకాశం కల్పించకపోవడం దుర్మార్గమైన చర్య.. మానవత్వం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. వికలాంగుల పెన్షన్ సమస్యల మీద కార్యచరణ రూపొందిస్తున్నాం.. ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నాం.. రద్దైన పెన్షనర్లను కలెక్టర్ల దగ్గరకు తీసుకుని వెళ్ళి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని సత్యనారాయణ తెలియజేశారు.

స్టీల్ ప్లాంట్‌పై డిప్యూటీ సీఎంకు బొత్స సూచనలు..

డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కౌన్సిల్ సాక్షిగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటించారని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ లోనే విభాగాల ప్రైవేటీకరణ చేస్తున్నారు.. ఈ నెల 30వ తేదీన జరగనున్న జనసేన సభలో స్టీల్ ప్లాంట్ పై తమ పార్టీ విధానాన్ని పవన్ కళ్యాణ్ ప్రకటించాలి.. ప్రమాదకరమైన పరిస్థితులో ఉన్న స్టీల్ ప్లాంట్ కోసం ఒక్క అడుగు తగ్గడానికి మేం సిద్దంగా ఉన్నాం.. ప్రధాన మంత్రి దగ్గరకు కలిసి వెళ్ళడానికి రెడీ.. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మిక, ప్రజా సంఘాలను ఐక్యం చేస్తామని వెల్లడించారు.

అలాగే, కార్యచరణ రూపొందించి ముందుకు వెళతామని మాజీ మంత్రి బొత్స తెలిపారు. త్వరలోనే తేదీలు ప్రకటిస్తామన్నారు. ఇక, 16 సార్లు ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్టీల్ ప్లాంట్ గురుంచి అడగలేదు అని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజల సమక్షంలోనే స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జగన్ అడిగింది నిజం కాదా అని పేర్కొన్నారు. మరి మీరు ఎందుకు అడగటం లేదన్నారు.

# ముంపు ప్రాంతాల్లో నిమ్మల పర్యటన.. నీళ్లలో నడుస్తూ సమస్యలపై ఆరా!



పశ్చిమ గోదావరి ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్):ముంపు ప్రాంతాల్లో సమస్యల శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కనకాయలంకలో నీటిలో నడుస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

“వరద సమయంలో కనకాయలంక కాజ్‌వే ముంపుతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.23 కోట్లతో వంతెన మంజూరు చేస్తాం. త్వరలో టెండర్లు పిలిచి ఏజెన్సీకి అప్పగిస్తాం. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద నష్ట నివారణకు కృషి చేస్తున్నాం. సీఎం నేతృత్వంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం” అని మంత్రి అన్నారు.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్ జి ఎఫ్ నూతన సెక్రటరీగా లావుడియా జయపాల్



క్రాంతి న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన సెక్రటరీగా జెడ్పిహెచ్ఎస్ రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఎల్ జయపాల్ ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ తెలిపారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్నటువంటి ఫిజికల్ డైరెక్టర్లు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు అందరూ కలిసి సమిష్టిగా ఎల్ జైపాల్ ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఈ ఎంపిక ప్రశాంత వాతావరణంలో జరిగిందని తెలిపారు నూతనంగా ఎంపికైన ఎస్జీఎఫ్ సెక్రటరీ లావుడియ జైపాల్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్జీఎఫ్ క్రీడల క్యాలెండర్ను సోమవారం విడుదల చేస్తామని రాష్ట్ర ఎస్జీఎఫ్ ఆదేశాల మేరకు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణ జరిపిస్తామని దీనికి జిల్లాలో పనిచేస్తున్నటువంటి వ్యాయామ విద్య ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు ఈ ఎన్నికకు సహకరించిన జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు నూతనంగా ఎన్నికైన ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ లావుడియా జైపాల్ కు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు

# గిరిజన సంక్షేమ శాఖలో సమస్యలు పరిష్కరించండి

**తండాల గుడాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి**

**గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ గారికి వినతి పత్రం అందించిన విద్యార్థి సంఘాల నేతలులి**

**అజ్మీరా వెంకట్ నాయక్ భానోత్ భాస్కర్ నాయక్**



హనుమకొండ 2,3 ఆగష్టు (క్రాంతి న్యూస్):గిరిజన తండాలు గుడాలకు ప్రత్యేక నిధులు కేటాయించి లని గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆశ్రమ పాఠశాలలో హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించి వారి యొక్క విద్యాభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు వర్షాకాలం సీజన్లో దోమతెరలు దుప్పట్లు అందించాలని అదేవిధంగా ఐ టి డి ఏ ఇంజనీరింగ్ శాఖలో జరుగుతున్నటువంటి అవినీతి అక్రమాలపై దృష్టి సారించాలని గ్రీన్ ఆ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది

# పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి కృషి: సీపీ అంబర్ కిషోర్ ఝూ

రామగుండం, 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ రామకృష్ణపూర్ పోలీస్ స్టేషన్ లో ఎఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ ఎం. వెంకట్ రెడ్డి, ఎఎస్ఐ (70 ) అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య శ్రీలత కి భద్రత ఎక్స్గ్రేషియా 8,00,000 రూపాయల చెక్ ను రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ కమిషనర్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మరణించిన ఏఎస్ఐ వెంకటరెడ్డి, కుటుంబ సభ్యుల స్థితిగతులను సిపి అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసేవిదంగా చూస్తామని తెలియజేశారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం తో పాటు వారి కుటుంబాలకి అండగా ఉంటామని సీపీ అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఓ శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు.



# ప్రజలు పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో సూచనలు**



భద్రాద్రి కొత్తగూడెం , 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లో శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం సహించబోమని హెచ్చరించారు. బాధ్యతగా వ్యవహరించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు చేపట్టాలని సూచించారు. ఉత్సవ కమిటీలకు నియమ నిబంధనలు తెలియజేసి, డీజేలు, టపాసులు నిషేధించబడ్డాయని వారికి స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్ నియంత్రణ పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆయన సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించేలా చర్యలు చేపట్టాలని, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

సైబర్ నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కఠినంగా కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, సిఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# రంగులు మార్చే ఊసరవెల్లి ప్రత్యక్షం ఆసక్తిగా తిలకించిన స్థానికులు



భద్రాద్రి కొత్తగూడెం, 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హనుమాన్ బస్తీలో అరుదైన రంగులు మార్చే ఊసరవెల్లి ప్రత్యక్షమైంది. రోడ్డు దాటుతుండగా అది ఉయ్యాలలా ఊగుతూ, కాసేపటికి చిలకపచ్చ, ఆపై ముదురు ఆకుపచ్చ, మరికొద్దిసేపటికి నలుపు చారలతో రంగులు మార్చడం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలో వీధి కుక్కలు దానిపై దాడి చేయడానికి ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకొని ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్కు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న సంతోష్ ఆ ఊసరవెల్లిని సురక్షితంగా పట్టుకున్నారు. ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ– "ప్రకృతిలో ఆకర్షణీయమైన జీవజాతులు చాలావరకు అంతరించిపోతున్నాయి. ఊసరవెల్లి కూడా వాటిలో ఒకటి. రాబోయే తరాలు ఇలాంటివి బొమ్మల్లో తప్ప ప్రత్యక్షంగా చూడలేకపోవచ్చు. దీనిని అడవికి తరలిస్తాం" అని తెలిపారు

# వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు



ములుగు 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): వన మహోత్సవంలో భాగంగా ఫారెస్ట్ అధికారులు శనివారం మోడల్ స్కూల్ బండారుపల్లి లో మొక్కలు నాటడం జరిగిందని ఎఫ్ఆర్ఓ శంకర్ తెలిపారు. స్కూల్ ఆవరణలో 1500 పండ్లు నీడనిచ్చే మొక్కలు, ఆర్నమెంటల్ ప్లాంట్స్ (షాడో పూలు) నాటడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# సహస్ర హత్యకేసులో నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్

**నిర్భయ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మల్లెల ఉషారాణి పిలుపు**



భద్రాద్రి కొత్తగూడెం , 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): కూకట్ పల్లి ప్రాంతంలో 10 ఏళ్ల చిన్నారి సహస్రను అత్యంత పాశవికంగా హత్య చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ దారుణం తెలంగాణ ప్రజలను ఐదు రోజులుగా కుదిపేస్తోందని, బాధలో ముంచేస్తోందని నిర్భయ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, న్యాయవాది మల్లెల ఉషారాణి అన్నారు. ఆమె మాట్లాడుతూ – "బాలుడి నేరానికి సంబంధించి 'బ్యాట్ కోసం వెళ్లాను' అంటూ కథలు చెబుతూ పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రిమినల్పై కఠినంగా చర్యలు తీసుకొని శిక్షించాలి. గతంలో ఇలాంటి కేసుల్లో తక్షణమే శిక్షించినట్లే ఇప్పుడూ బాధితులకు న్యాయం జరగాలి. అలా చేస్తేనే భవిష్యత్తులో మరెవ్వరూ ఇలాంటి నేరాలకు పాల్పడరని" అన్నారు. తల్లిదండ్రులకు పిలుపునిస్తూ– "పిల్లలు చిన్ననాటి నుంచే ఎలా ప్రవర్తిస్తున్నారో, సెల్ఫోన్ల వినియోగం ఎలా ఉందో గమనించాలి. స్కూల్లో, సమాజంలో ప్రవర్తనపై దృష్టి పెట్టాలి. కష్టపడి చదివించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకునేలా తీర్చిదిద్దాలి. లేకపోతే ఇటువంటి సంఘటనలకు పాల్పడే అవకాశం ఉంటుంది" అని ఉషారాణి అన్నారు.

# బాదం ప్రవీణ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

**ఘనంగా బాదం ప్రవీణ్ పుట్టినరోజు వేడుకలు**

**శుభాకాంక్షలు తెలియజేసి అభిమానం చాటుకున్న నాయకులు, కార్యకర్తలు**




ములుగు జిల్లా, 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ పుట్టినరోజు వేడుకలు శనివారం ములుగు జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. బాదం ప్రవీణ్ పుట్టినరోజును పురస్కరించుకొని మంత్రి సీతక్క ఆయనకు శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్,ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ ములుగు అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ములుగు జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో బాదం ప్రవీణ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా జిల్లా లోని కళాకారులు సైతం బాదం ప్రవీణ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం పాటు పడుతూ ప్రతినిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న బాదం ప్రవీణ్ పుట్టినరోజు వేడుకలు శనివారం ములుగు లో ఘనంగా జరిగాయి. రైస్ మిల్లర్ల అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ జిల్లా రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న బాదం ప్రవీణ్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా ప్రజానీకం పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపి తమతమ అభిమానాన్ని తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తన పుట్టినరోజు వేడుకలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిగాయని, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా బాదం ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీశైలం మల్లికార్జున బ్రమరాంబిక స్వామి దర్శించుకున్న బీసీ కాంగ్రెస్ నాయకులు బండారి గంగాధర్



నర్సాపూర్, 23 ఆగష్టు (క్రాంతి న్యూస్): మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్ . జ్యోతిర్లింగాలలో ఒకటైనటువంటి శ్రీశైల మల్లికార్జున బ్రమరాంబిక స్వామిని దర్శించుకోవడం జరిగింది.. అలాగే శివయ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు మన గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో భోగభాగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆ మల్లికార్జున స్వామిని దర్శన భాగ్యం చేసుకోవడం జరిగింది ఈసారి వర్షాలు బాగా పడి చెరువులు బాగా నిండి నాయి కాబట్టి రైతన్న కళ్ళల్లో ఆనందం వ్యక్తం చేయడం జరిగింది. అలాగే పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ భగవంతున్ని మల్లికార్జున స్వామి భ్రమరాంబిక దేవి అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది... ఈ కార్యక్రమంలో బి జి ఆర్ యువసేన సభ్యులు పాల్గొని మల్లికార్జున బ్రమరాంబిక అమ్మవారి ఆశీస్సులు పొందడం జరిగింది

# పిత్తాశయంలో రాళ్లు ఉంటే
## పొరపాటున కూడా కొన్ని తినొద్దు



హెల్త్ న్యూస్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): పిత్తాశయం మన జీర్ణవ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం. దీనిలో పిత్త రసం పేరుకుపోతుంది. అయితే, కొన్నిసార్లు ఆహారం, జీవనశైలిలో ఆటంకాల కారణంగా కొలెస్ట్రాల్, కాల్షియం లేదా ఇతర అంశాలు పిత్తాశయంలో పెద్ద పరిమాణంలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా, చిన్న గట్టి ముక్కలు ఏర్పడటం ప్రారంభిస్తాయి. ఈ పరిస్థితిని సాధారణంగా పిత్తాశయ రాళ్ళు అని పిలుస్తారు. సాధారణంగా ఈ సమస్య పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రారంభంలో ఇది తేలికపాటి నొప్పి, అజీర్ణం, బరువును కలిగిస్తుంది.

సరైన కాలంలో చికిత్స చేయకపోతే ఇది తీవ్రమైన సమస్యల్ని కలిగిస్తుంది. పిత్తాశయంలో రాళ్లు ఉంటే తీవ్రమైన పరిస్థితిని కలిగిస్తుంది. నొప్పి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. పిత్తాశయంలో రాళ్లు ఉంటే కొన్ని ఆహారాల్ని నివారించాలని నిపుణులు చెబుతున్నారు. పిత్తాశయంలో రాళ్లు ఉంటే ఏం తినాలి, ఏం తినకూడదు అన్న విషయాలు తెలుసుకుందాం. దీంతో పాటు ఇతర చిట్కాల గురించి కూడా ఓ లుక్కేద్దాం.

### పిత్తాశయం చేసే పనేంటి?

పిత్తాశయం మన జీర్ణవ్యవస్థలో ఒక భాగం. పిత్తాశయం పిత్తం అని పిలిచే ఎంజైమ్‌ను ఉత్పత్తి చేస్తుంది. పిత్తాశయం సాయంతో కాలేయంలో కొవ్వు జీర్ణమవుతుంది. పిత్తాశయంలో రాళ్లు ఉంటే, అవి పిత్త మార్గాన్ని అడ్డుకుంటాయి. అంటే అవి పిత్త వాహికను అడ్డుకుంటాయి. దీని కారణంగా కొవ్వును జీర్ణం చేసే ఎంజైమ్ కాలేయాన్ని చేరుకోలేకపోతుంది. దీంతో తీవ్రమైన నొప్పి, వాంతులు, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడాల్సి వస్తుంది. పిత్తాశయంలో రాళ్ల సమస్యతో బాధపడేవారు తినే ఆహారం విషయంలో దృష్టి పెట్టాలి.

### పిత్తాశయంలో రాళ్లు ఉంటే ఏం తినకూడదు?

నిపుణులు మాట్లాడుతూ పిత్తాశయ రాళ్లు ఒక తీవ్రమైన సమస్య అని అన్నారు. అయితే, ప్రారంభంలో కొన్ని పద్ధతులను అవలంబించడం ద్వారా, ఈ పరిస్థితి నుంచి రిలీఫ్ పొందవచ్చు. ముఖ్యంగా తినే ఆహారం విషయంలో శ్రద్ధ తీసుకుంటే ఈ పరిస్థితిని నివారించవచ్చు. పిత్తాశయంలో రాళ్లు సమస్యతో బాధపడుతుంటే వేయించిన, కారంగా ఉండే ఆహారాలకు దూరంగా ఉండాలి. రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన ఆహారం, ప్యాక్ చేసిన ఫుడ్స్ తీసుకోవడం మానుకోవాలి. క్రీమ్, వెన్నతో పాటు అధిక కొవ్వు ఉన్న పాల ఉత్పత్తులను నివారించాలి. ప్రాసెస్ చేసిన పిండి, వైట్ రైస్, చక్కెర వంటి ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి.

### ఏం తినాలి?

ఆహారంలో ఫైబర్ అధికంగా ఉండే ఆహారాల్ని చేర్చుకోమని నిపుణులు సిఫార్స్ చేస్తున్నారు. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది పిత్తాశయంపై ఒత్తిడిని తగ్గిస్తుంది. యాపిల్, జామ, ఓట్స్, తృణధాన్యాలు వంటి వాటిని చేర్చుకోవచ్చు.

పిత్తాశయంలో రాళ్లు ఉంటే, పాలకూర, మెంతి కూర వంటి ఆకుకూరలను తినమని వైద్యులు సిఫార్సు చేస్తారు. వీటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి పిత్తాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి నీళ్లు, నిమ్మరసం కూడా ఆహారంలో చేర్చుకోవాలి. ఈ రెండూ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సాయపడతాయి. దీంతో రాళ్లు ఏర్పడే ప్రమాదం తగ్గుతుంది.

పిత్తాశయంలో రాళ్లు ఉంటే ఆహారంలో పసుపును చేర్చుకోండి. పసుపు వాపును తగ్గించడానికి సాయపడుతుంది. అంతేకాకుండా కాలేయం-పిత్తాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో పసుపు సాయపడుతుంది.

వీటితో పాటు ఒమేగా-3, విటమిన్ డి అధికంగా ఉండే ఫుడ్స్‌ను ఆహారంలో చేర్చుకోండి. ఇందుకోసం వాల్‌నట్స్, అవిసె గింజలు మొదలైనవి తినవచ్చు.

### ఇంటి చిట్కాలు

పిత్తాశయంలో రాళ్లు ఉంటే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి ఖాళీ కడుపుతో తాగవచ్చు. ఇది రాళ్లను చిన్న ముక్కలుగా విరగొట్టడంలో సాయపడుతుందని నిపుణులు అంటున్నారు.

ఆపిల్ సైడర్ వెనిగర్‌ను నీటిలో కలిపి తాగండి. ఇది పిత్తాశయాన్ని క్లియర్ చేయడానికి , నొప్పిని తగ్గించడానికి సాయపడుతుంది.

పుదీనా టీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవారు పుదీనా టీ తాగాలని నిపుణులు సిఫార్స్ చేస్తున్నారు.

త్రిఫల పొడిని రోజుకు ఒకటి లేదా రెండుసార్లు కొద్ది మొత్తంలో తీసుకోండి. ఇది కాలేయం, జీర్ణవ్యవస్థను నిర్విషీకరణ చేస్తుంది.

నిపుణుల ప్రకారం ఆహారంలో ఈ చిన్న మార్పులు చేయడం ద్వారా, చాలా వారకు ఉపశమనం పొందవచ్చు. దీంతో పాటు... ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం లేదా యోగా చేయండి. బరువును అదుపులో ఉంచుకోండి. ఎందుకంటే ఊబకాయం రాళ్లకు ప్రధాన కారణం. శరీరం నిర్విషీకరణను కొనసాగించడానికి రోజంతా తగినంత నీరు తాగాలి. అలాగే, ఎప్పటికప్పుడు అల్ట్రాసౌండ్, డాక్టర్ సలహాలను తీసుకుంటూ ఉండాలి. అయితే, నొప్పి ఎక్కువగా ఉంటే లేదా రాయి పెద్దదిగా మారితే ఖచ్చితంగా డాక్టర్‌ని సంప్రదించి తగిన వైద్యం పొందాలి.

# బాగా పండిన అరటి పండ్లను తింటే
## ఇన్ని లాభాలు ఉన్నాయా..?



హెల్త్ న్యూస్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): అరటి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. చాలా తక్కువ ధరను కలిగి ఉంటాయి. కనుక వీటిని అధిక శాతం మంది కొనుగోలు చేసి తింటుంటారు. అయితే అరటి పండ్లను చాలా మంది పూర్తిగా పండ్లుగా మారకుండా కాస్త దోరగా ఉన్నప్పుడే తింటారు. కానీ దోరగా ఉన్న పండ్ల కన్నా బాగా పండిన అరటి పండ్లను తింటేనే ఎక్కువ లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బాగా పండిన అరటి పండ్లను తినడం వల్ల సాధారణ పండ్లలో కన్నా రెట్టింపు మొత్తంలో పోషకాలు లభిస్తాయి. ఇలాంటి పండ్లను తింటే అనేక వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు. అనేక ఆరోగ్య ప్రయోజనాలను సైతం ఇవి అందిస్తాయి. ఈ క్రమంలోనే బాగా పండిన అరటి పండ్లను తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**పోషకాలు అధికం..**


సాధారణ అరటికాయల కన్నా బాగా పండిన అరటి పండ్లను తింటే తేలిగ్గా జీర్ణమవుతాయి. చిన్నారులు, వృద్ధులు సైతం ఇలాంటి పండ్లను సులభంగా జీర్ణం చేసుకోగలుగుతారు. దీంతో పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. బాగా పండిన అరటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. బాగా పండిన అరటి పండ్లపై నల్లని లేదా గోధుమ రంగు మచ్చలు ఉంటాయి. ఇలాంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని అర్థం చేసుకోవాలి. వీటిల్లో విటమిన్ సి, డోపమైన్ వంటివి కూడా అధికంగా ఉంటాయి. అందువల్ల బాగా పండిన పండ్లను తింటే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో దోహదం చేస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. అనేక తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

**గుండె ఆరోగ్యానికి..**

బాగా పండిన అరటి పండ్లలో పొటాషియం సైతం అధికంగా ఉంటుంది. అలాగే మెగ్నిషియం స్థాయిలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. గుండె పోటు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బాగా పండిన అరటి పండు సహజసిద్ధమైన అంటాసిడ్ మాదిరిగా పనిచేస్తుంది. అందువల్ల ఈ పండ్లను తింటే అసిడిటీ తగ్గిపోతుంది. జీర్ణాశయ గోడలపై ఉండే మ్యూకస్ పొర రక్షించబడుతుంది. దీంతో కడుపులో మంట, గుండెల్లో మంట, అజీర్తి నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. బాగా పండిన అరటి పండ్లలో ట్రిప్టోఫాన్ అనే సమ్మేళనం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది ఒక అమైనో యాసిడ్. ఇది మన శరీరంలో సెరొటోనిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. సెరొటోనిన్ ఒక న్యూరోట్రాన్స్‌మిటర్. ఇది మూడ్‌ను నియంత్రిస్తుంది. ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడేస్తుంది. మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. దీంతో మానసికంగా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారు.

**శక్తికి, ఉత్తేజానికి..**

బాగా పండిన అరటి పండ్లను తినడం వల్ల శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. ఈ పండ్లలో ఉండే చక్కెరలను శరీరం సులభంగా గ్రహిస్తుంది. దీంతో తక్షణమే శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. ఉత్తేజంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట నుంచి వెంటనే బయట పడవచ్చు. ఇక బాగా పండిన అరటి పండ్లను తినేటప్పుడు లోపలి గుజ్జులో ఎలాంటి మచ్చలు లేకుండా చూసుకోవాలి. మరీ అతిగా పండిన అరటి పండు నుంచి మురిగిన వాసన వస్తుంది. అలాంటి పండ్లను తినకూడదు. అరటి పండుపై ఒక మాదిరిగా మచ్చలు ఉన్నవి ఎంపిక చేసుకోవాలి. మరీ అతిగా మచ్చలు ఉండకూడదు. అవి లోపల కుళ్లిపోయి ఉండే అవకాశం ఉంటుంది. ఇలా బాగా పండిన అరటి పండ్లను తెచ్చుకుని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.



క్రాంతి
# క్రీడలు
epaper.krtvnews.com



## రోహిత్, విరాట్ కోహ్లి రిటైర్‌మెంట్!? బీసీసీఐ ఉపాధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు



స్పోర్ట్స్ న్యూస్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): టీమిండియా దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఆస్ట్రేలియా టూర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టీ20లు, టెస్టుల నుంచి రిటైర్మెంట్ తీసుకున్న వీరిద్దరూ కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు.

ఛాంపియన్స్ ట్రోఫీ-2025 తర్వాత రో-కో ద్వయం ఇప్పటివరకు భారత తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అయితే వన్డే ప్రపంచకప్-2027 దృష్ట్యా వీరిద్దరి స్థానాల్లో యువ ఆటగాళ్లను బీసీసీఐ సిద్ధం చేయనుందని, అక్టోబర్‌లో ఆసీస్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డేల సిరీసే ఆఖరిదని ప్రచారం జరుగుతోంది.

తాజాగా ఈ సీనియర్ ద్వయం రిటైర్మెంట్ వార్తలపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించాడు. అవన్నీ వట్టి రూమర్సే అని అతడు కొట్టిపారేశారు. రోహిత్, కోహ్లి ఇద్దరూ వైట్ బాల్ క్రికెట్‌లోకి తిరిగొచ్చేందుకు తమ ట్రైనింగ్‌ను తిరిగి ప్రారంభించారు. కాగా రాజీవ్ శుక్లా ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ క్రమంలో శుక్లాను సచిన్ టెండూల్కర్‌లాగానే రోహిత్, కోహ్లిలకు ప్రత్యేకంగా ఫేర్‌వెల్ నిర్వహిస్తారా ? అని హోస్ట్ ప్రశ్నించాడు.

“రోహిత్, కోహ్లి ఇంకా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ కాలేదు. వారిద్దరూ ఇంకా వన్డేలు ఆడుతున్నారు. వారు ప్రస్తుతం కేవలం రెండు ఫార్మాట్ల నుంచి మాత్రమే తప్పుకొన్నారు. మరో ఫార్మాట్‌లో ఆడుతున్నప్పుడు మీరెందుకు వారి ఫేర్‌వెల్ గురుంచి మాట్లాడుతున్నారు? వారి రిటైర్‌మెంట్ గురించి మీరంతా ఎందుకు ఆందోళన చెందుతున్నారు? బీసీసీఐకి ఒక పాలసీ ఉంటుంది.

బీసీసీఐ ఎవరిని కూడా రిటైర్‌మెంట్ ఇవ్వమని అడగదు. వారే సొంతంగా తమ నిర్ణయాలు తీసుకోవాలి. ప్లేయర్ తీసుకునే నిర్ణయాన్ని మేము గౌరవిస్తాము. ఆటగాళ్ల విషయంలో ఏ నిర్ణయం తీసుకోవాలో మాకు తెలుసు. కానీ ఇదంతా ఇప్పుడు అనవసరం.

విరాట్ కోహ్లి చాలా ఫిట్‌గా ఉన్నాడు. రోహిత్ శర్మ కూడా బాగా ఆడుతున్నాడు. కాబట్టి వారి ఫేర్‌వెల్ గురుంచి ఆలోచిండం ఆపయేండి” అని శుక్లా పేర్కొన్నాడు. కాగా ఈ ఏడాది ఆక్టోబర్‌లో భారత జట్టు ఆసీస్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో భాగంగా ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది.

## ప్రపంచ కప్ షెడ్యూల్‌ను మార్చిన ఐసిసి.. చిన్నస్వామి స్టేడియం ఔట్..



స్పోర్ట్స్ న్యూస్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్): వచ్చే నెలలో భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న మహిళల వన్డే ప్రపంచ కప్ షెడ్యూల్‌లో ఐసిసి మార్పులు చేసింది. బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియం నుండి ఆతిథ్యాన్ని ఐసిసి తొలగించి వేరే స్టేడియంకు మార్చింది. ఈ ప్రపంచ కప్ మ్యాచ్‌లకు మొత్తం ఐదు స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఆ స్టేడియాలలో ఒకటి బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియం. దీనిలో ఇకపై మ్యాచ్‌లు జరగవు. బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లు ఇకపై నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో జరుగుతాయని ఐసిసి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ స్టేడియంలో మొత్తం ఐదు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. వాటిలో మూడు మ్యాచ్‌లు లీగ్ దశకు చెందినవి. ఒకటి సెమీ-ఫైనల్ మ్యాచ్. భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటే, ఈ టైటిల్ మ్యాచ్ కూడా ఈ స్టేడియంలోనే జరిగేది. ఈ మ్యాచ్‌లన్నీ ఇప్పుడు డి.వై పాటిల్ స్టేడియంలోనే జరుగుతాయి. వాస్తవానికి, కర్ణాటక ప్రభుత్వం చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌లను నిర్వహించడానికి సురక్షితం కాదని గుర్తించింది. అందుకే ఈ స్టేడియం నుండి ఆతిథ్యాన్ని ఐసీసీ తొలగించింది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ గెలుచుకున్న తర్వాత, ఎం . చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ పరేడ్ జరిగింది. ఈ విజయోత్సవ పరేడ్ సందర్భంగా, స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుంది. దీనిలో 11 మంది మరణించారు. అలాగే, 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత, జస్టిస్ జాన్ మైఖేల్ డి’కున్హా అధ్యక్షతన ఒక కమిషన్ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. దర్యాప్తులో ఎం . చిన్నస్వామి స్టేడియం భారీ కార్యక్రమాలకు సురక్షితం కాదని తేలింది.

2025 ఐసిసి మహిళల క్రికెట్ ప్రపంచ కప్ మొదటి సెమీ-ఫైనల్ అక్టోబర్ 29 న గౌహతి లేదా కొలంబోలో జరుగుతుంది. రెండవ సెమీ-ఫైనల్ అక్టోబర్ 30 న నవీ ముంబైలో జరుగుతుంది. టోర్నమెంట్ ఫైనల్ నవంబర్ 2 న కొలంబో లేదా నవీ ముంబైలో జరుగుతుంది. పాకిస్తాన్ జట్టు చివరి-4కి అర్హత సాధిస్తే, అది కొలంబోలో మొదటి సెమీ-ఫైనల్ ఆడుతుంది. పాకిస్తాన్ జట్టు ఫైనల్‌కు చేరుకుంటే, టైటిల్ మ్యాచ్ కూడా కొలంబోలోనే జరుగుతుంది. సెమీఫైనల్ మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరిగితే, మొదటి సెమీఫైనల్ కొలంబోలోనే జరుగుతుంది. పాకిస్తాన్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకోలేకపోతే, అన్ని నాకౌట్ మ్యాచ్‌లు భారతదేశంలోనే జరుగుతాయి.

## అప్పుడు సచిన్ సలహాను వినలేదు.. ఇప్పటికీ చింతిస్తా: రాహుల్ ద్రవిడ్



స్పోర్ట్స్ న్యూస్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్):రాహుల్ ద్రవిడ్ - సచిన్ తెండూల్కర్ కలిసి టెస్టుల్లో భారీ భాగస్వామ్యాలు నిర్మించిన సందర్భాలెన్నో. సచిన్‌ను ప్రత్యర్థి బౌలర్లు రెచ్చగొట్టి పెవిలియన్‌కు చేరుస్తారేమో కానీ.. ద్రవిడ్ ముందు మాత్రం వారి పప్పులు ఉడకవు. తనంతటతానే ఔటైతే తప్పితే రాహుల్‌ను అడ్డుకోవడం ఎంతటి బౌలర్‌కైనా కష్టసాధ్యమే. ద్రవిడ్‌కు బౌలింగ్ చేసి వారే నీరసపడిపోవాల్సిందే. అందుకే అతడిని ‘ది వాల్’ అంటూ క్రికెట్ ప్రేమికులు పిలుస్తారు. అయితే, తన కెరీర్‌లో చేసిన పొరపాటును ఎప్పటికీ మరిచిపోలేనని.. సచిన్ ఇచ్చిన సలహాను కూడా పట్టించుకోలేదని గుర్తు చేసుకున్నాడు. అదీనూ 2011 ఇంగ్లాండ్ పర్యటన సందర్భంగా కావడం గమనార్హం. రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌లో ద్రవిడ్ తన అనుభవాలను పంచుకున్నాడు.“నా కెరీర్‌లో డీఆర్‌ఎస్‌ను ఒకసారి సరిగా వాడుకోలేదని ఇప్పటికీ చింతిస్తా. అదీ 2011లో మేం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాం. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో జేమ్స్ అండర్సన్ బంతిని ఆడా. అప్పుడు ఏదో శబ్దం వచ్చినట్లు అనిపించింది. కానీ, అది బ్యాట్‌ను తాకలేదని భావించా. కొన్నిసార్లు బ్యాటర్‌కు అలా అనిపించడం సహజమే. బయట నుంచి చాలా శబ్దం వస్తోంది. అందుకే, నాకు అనిపించలేదు. సైమన్ టౌఫెల్ ఔట్‌గా ఇచ్చాడు. వెంటనే సచిన్ వద్దకు వెళ్లా. సైమన్ మంచి అంపైర్. అతడు పొరపాటుగా ఇవ్వడని భావించా. సచిన్ మాత్రం ఏదో శబ్దం వచ్చిందని చెప్పాడు. ఆ బంతిని కొట్టావు అని అన్నాడు. కానీ, నాకు మాత్రం అలా అనిపించలేదు. డీఆర్‌ఎస్ తీసుకోకుండా డగౌట్‌కు వెళ్లిపోయా. కానీ, సమీక్షలో బంతి వికెట్లకు దూరంగా వెళ్లింది. ఆ శబ్దం మాత్రం నా షూలేస్‌కు బ్యాట్ తాకడంతో వచ్చింది” అని ద్రవిడ్ వెల్లడించాడు.ఎంఎస్ ధోనీ నాయకత్వంలో భారత్ అక్కడికి వెళ్లింది. ఈ సిరీస్‌లో ద్రవిడ్ మూడు సెంచరీలు బాదాడు. మొత్తం 461 పరుగులు చేశాడు. ఆ సిరీస్‌ను టీమ్‌ఇండియా చేజార్చుకున్నా.. ద్రవిడ్ ఆటతీరు మాత్రం ఆకట్టుకుంది.

## శుభ్‌మన్ గిల్‌కు వైరల్ ఫీవర్.. దులీప్ ట్రోఫీకి దూరం!



స్పోర్ట్స్ న్యూస్ ,23 ఆగస్టు (క్రాంతి న్యూస్):త్వరలోనే దులీప్ ట్రోఫీ.. ఆపై పది రోజులకే ఆసియా కప్ మొదలవుతుంది. మొన్నటివరకూ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో దుమ్మురేపిన శుభ్‌మన్ గిల్ టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా మారాడు. ఇంతలోనే అభిమానులకు బ్యాడ్ న్యూస్. దులీప్ ట్రోఫీకి దూరమైనట్లు తెలుస్తోంది. అలాగే ఆసియా కప్ బరిలోకి దిగడం పైనా అనుమానాలు వస్తున్నాయి. తాజాగా గిల్ వైరల్ ఫీవర్ బారిన పడినట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే రక్త నమూనాలను బ్లడ్ టెస్టుకు పంపినట్లు సమాచారం. ఆ రిపోర్ట్ బీసీసీఐ వద్దకు చేరిందని.. దీంతో దులీప్ ట్రోఫీ నుంచి అతడికి మినహాయింపు దక్కిందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. నార్త్ జోన్ జట్టు సారథిగా తొలుత గిల్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడికి బదులు వైస్ కెప్టెన్‌గా ఉన్న అంకిత్ కుమార్ జట్టును నడిపించే అవకాశాలు ఉన్నాయి.

మరి ఆ టోర్నీ సంగతి?

ఆసియా కప్ కోసం ఇప్పటికే భారత స్క్వాడ్‌ను ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. గిల్‌ను వైస్ కెప్టెన్‌ను చేసింది. ఆసియా కప్ కోసం భారత్ సెప్టెంబర్ ఆరంభంలోనే యూఏఈకి పయనం కానుంది. సెప్టెంబర్ 5న తొలి ట్రైనింగ్ సెషన్ జరగనుంది. ఆలోగా గిల్ పూర్తిగా కోలుకుంటే ఎలాంటి అవాంతరం లేకుండా దుబాయ్ చేరుకుంటాడు. ఎలాగూ దులీప్ ట్రోఫీలో అతడు ఆడటం లేదు. ఆసియా కప్‌లో భారత్ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడాల్సిఉంది. దీంతో ఫిట్‌నెస్‌ను అందుకోవడానికి గిల్‌కు ఇంకా చాలా సమయం ఉంది. కాబట్టి, ఆసియా కప్ నుంచి గిల్ వైదొలగడం దాదాపు అసాధ్యమే. అయితే, వైరల్ ఫీవర్ టెస్టు ఫలితాలను బట్టి బీసీసీఐ నిర్ణయం తీసుకొనే అవకాశం లేకపోలేదు.

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## 'డ్యూడ్' ఫస్ట్ సింగిల్ 'బూమ్ బూమ్' ఆగస్ట్ 28న విడుదల

యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. తాజాగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. 'డ్యూడ్' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ యూత్ఫుల్ ఎంటర్టైనర్ కు కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రంలో ప్రదీప్‌కు జోడీగా "ప్రేమలు" ఫేమ్ మమిత బైజూ నటిస్తుండగా, ప్రముఖ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రదీప్, మమిత ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి.

తాజాగా మేకర్స్ నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ వచ్చింది. 'డ్యూడ్' చిత్రం నుంచి తొలి పాట 'బూమ్ బూమ్' ఆగస్ట్ 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూ ట్రెండీ & స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకున్నారు.

ఈ చిత్రానికి టాలెంటెడ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ సంగీతాన్ని అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దీపావళి కానుకగా ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



తారాగణం:

ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, మమిత బైజు, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం

సాంకేతిక బృందం:

రచన, దర్శకత్వం: కీర్తిశ్వరన్
నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్
సీఈవో: చెర్రీ
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని
సంగీతం: సాయి అభ్యంకర్
సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి
ప్రొడక్షన్ డిజైనర్: లతా నాయుడు
కాస్ట్యూమ్ డిజైనర్: పూర్ణిమా రామస్వామి
ఎడిటింగ్: భరత్ విక్రమన్
పీఆర్ఓ: వంశీ – శేఖర్
మార్కెటింగ్: ఫస్ట్ షో

## 'హైవాన్' రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం




అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ హైవాన్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సరికొత్త థ్రిల్లర్ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు కోచిలో ప్రారంభమైంది. ఊటీ, ముంబైలలో ఈ సినిమా చిత్రీకరణ జరుపుకోనుంది.

హైవాన్ మూవీతో అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ 17 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాలో నటించడం ఎగ్జైటింగ్ గా ఉందని సోషల్ మీడియా ద్వారా అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ తెలిపారు. హైవాన్ చిత్రాన్ని టాప్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు నిర్మాతలు వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్.




నటీనటులు – అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్, తదితరులు ,

**టెక్నికల్ టీమ్**

పీఆర్ఓ – జీఎస్ కే మీడియా (సురేష్ – శ్రీనివాస్) , బ్యానర్స్ – కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ , నిర్మాతలు – వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్ , రచన, దర్శకత్వం – ప్రియదర్శన్

## సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న "లిటిల్ హార్ట్స్" మూవీ




"90s మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90s మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.

ఈ సినిమా సెప్టెంబర్ 12న రిలీజ్ కావావాల్సి ఉండగా..ఒక వారం ముందుగానే 5వ తేదీనే థియేటర్స్ లోకి తీసుకొస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా కొత్త రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా మూవీ టీమ్ స్పందిస్తూ ప్రేక్షకులను నవ్వించేందుకు ముందుగానే వస్తున్నాం అని తెలిపారు. ఇటీవలే రిలీజ్ చేసిన ఈ సినిమా టీజర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. థియేటర్స్ లోనూ ఇదే ఆదరణ దక్కుతుందని "లిటిల్ హార్ట్స్" టీమ్ నమ్మకంతో ఉంది.

నటీనటులు – మౌళి తనూజ్, శివానీ నాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు

**టెక్నికల్ టీమ్**

రచన, దర్శకత్వం – సాయి మార్తండ్ ,ప్రొడ్యూసర్ – ఆదిత్య హాసన్ , పీఆర్ఓ – జీఎస్ కే మీడియా (సురేష్ – శ్రీనివాస్), మ్యూజిక్ – సింజిత్ యెర్రమల్లి , సినిమాటోగ్రఫీ – సూర్య బాలాజీ , ఎడిటర్ – శ్రీధర్ సొంపల్లి , ఆర్ట్ డైరెక్టర్ – దివ్య పవన్ , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ – వినోద్ నాగుల, మురళి పున్న

## టాలీవుడ్ లో బంపర్ ఆఫర్ అందుకున్న.. రాషా తడానీ !



బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్ గురించి పరిచయం అవసరం లేదు. 90ల యూత్ కలల రాణిగా వెలిగిన రవీనా, అందం, డ్యాన్సింగ్ ట్యాలెంట్ తో బాలీవుడ్ ని ఏలింది. ఇప్పుడు ఆమె కుమార్తె రాషా తడానీ టాలీవుడ్‌కి అడుగుపెడుతోంది. ఇప్పటికే రాషా బాలీవుడ్‌లో ఆజాద్ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అవ్వగా, ఇందులో అజయ్ దేవగన్ మేనల్లుడు అమన్ దేవగన్ సరసన నటించింది. ఈ సినిమాలోని 'ఉయ్ అమ్మా..' పాటతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న రాషా కెరీర్‌కి పెద్ద పీటం ఏర్పడింది.

కొద్దిరోజుల క్రితం నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సరసన రాషా టడానీ హీరోయిన్‌గా ఉంటుందని వార్తలు వినిపించాయి. అయితే ఆ ప్రాజెక్ట్ అనూహ్యంగా ఆగిపోయిందని, ఆ తర్వాత మహేష్ కుటుంబం నుంచి హీరో జయకృష్ణ సరసన రాషా కథానాయికగా ఎంపిక అయ్యారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా త్వరలో చిత్రీకరణకు వెళ్లనుందట. ఈ ప్రాజెక్ట్‌ను ఆర్ఎక్స్ 100 ఫేమ్ అజయ్ భూపతి లాంచ్ చేస్తారని, ప్రీ-ప్రొడక్షన్ కొనసాగుతోందని తెలిసింది. వైజయంతి మూవీస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు టైటిల్, కాస్టింగ్ వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com